నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 10 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



బెల్లంపల్లి : ప్రమాదబీమా చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి/వేమనపల్లి, జనవరి 9 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. వేమనపల్లి మండల గొర్లపల్లి గ్రామపంచాయతీ కొత్తకాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ముల్కల్ల శంకర్ కుటుంబానికి గురువారం పట్టణంలోని తన నివాసంలో రూ.రెండు లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో చెక్కు మంజూరైందని తెలిపారు. బాధిత కుటుంబాలను కాపాడుకునే బాధ్యత పార్టీపై ఉందని పేర్కొన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. హామీలు నెరవేర్చాలని ప్రశ్నిస్తున్నందుకే కేటీఆర్‌పై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వేమనపల్లి మండల అధ్యక్షుడు కోళి వేణుమాధవ్‌రావు, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, మాజీ సర్పంచ్ మోర్ల పద్మ, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు పుణ్ణం, మొండి, పర్వతాలు, బూరం బానయ్య, శ్రీశైలం, బానేష్ పాల్గొన్నారు.

కుమ్రం భీం చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మాకు వేరే జీపీ వద్దు

- విడదీయాలని చూస్తే ఊరుకోం
- కౌటాల గ్రామస్తుల ఆగ్రహం
- కేబీ చౌరస్తాలో రాస్తారోకో
- తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

కౌటాల, జనవరి 9 : 'మాకు పాలనా పరంగా ఎలాంటి సమస్యలు లేవు. మాకు వేరే గ్రామ పంచాయతీ కావాలని ఎప్పుడైనా అడిగామా.. మరి ఇప్పుడు ఎందుకు విడదీయాలని చూస్తున్నరు. మాకు వేరే జీపీ వద్దే వద్దు' అంటూ కౌటాల గ్రామస్తులు స్పష్టం చేశారు. మా గ్రామ పంచాయతీని విడదీయొద్దని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో గంటపాటు రాస్తారోకో చేపట్టారు. ఎస్ఐ మధుకర్ కలగజేసుకుని వారిని సముదాయించి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. ఆపై తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న గ్రామస్తులు అక్కడ కూడా మరో గంట పాటు ధర్నా చేశారు. కొంత మంది తమ స్వార్థ రాజకీయం కోసం పంచాయతీని విడదీసే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీని వేరు చేసేందుకు ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రతిపాదించడం సరికాదన్నారు. మా నుంచి ఎలాంటి వినతి లేకుండా, ప్రజల అభిప్రాయం తీసుకోకుండా, పంచాయతీలో కనీసం సమావేశం ఏర్పాటు చేయకుండా ఇలా ఎంపీడీవో కేవలం అరగంటలో పంచాయతీని వేరు చేస్తూ ప్రతిపాదనలు పంపడం సరికాదన్నారు. వెంటనే దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజల కోసం ఉన్నారా.. లేక పాలకుల మాటలు వినేందుకు ఉన్నారా.. అంటూ ప్రశ్నించారు. సీఐ రమేశ్ వారికి నచ్చజెప్పి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకుడు నక్క శంకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, సదాశివపేట, శివలింగపూర్ గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఓబీ మట్టి లారీలను అడ్డుకున్న రైతులు

- రోడ్డుకు అడ్డుగా పోసిన మట్టిని తొలగించాలని ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ

ఇందారం ఓపెన్‌కాస్టు గని నుంచి ఓబీ మట్టిని తరలిస్తున్న లారీలను అడ్డుకున్న రామారావుపేట రైతులు

జైపూర్, జనవరి 9 : ఇందారం ఓపెన్ కాస్టు గని నుంచి ఓబీ మట్టిని తరలిస్తున్న వాహనాలను గురువారం రామారావుపేట గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. రామారావుపేట గ్రామం నుంచి గోదావరికి వెళ్లే వందల ఏళ్లనాటి రహదారిని మట్టి పోసి మూసివేశారని, ఓబీ తరలిస్తున్న రోడ్డుకు అడ్డంగా ఉంటే ఫ్లై ఓవర్ వేసుకొని మట్టిని తరలించుకోవాలని ఆందోళనకు దిగారు. సింగరేణి అధికారుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని రోడ్డుకు అడ్డుగా పోసిన మట్టిని తొలగించడంతో వారు శాంతించారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపాకే రోడ్డును మూసి వేయాలని, లేదంటే ఆందోళనలు తప్పవని రైతులు హెచ్చరించారు. ఇక్కడ నిర్మిస్తున్న ఓ రైస్‌మిల్‌కు అనుకూలంగా రూ. 95 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు సింగరేణి అధికారులు టెండర్లు పిలిచారని, ఆ రోడ్డును వెంటనే రద్దు చేసి గ్రామం నుంచి గోదావరికి వెళ్లే రోడ్డును బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గోలి రాములు, వెంకటేశ్, కుమ్మరికుంట కుమార్, అరికె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

- న్యాయం చేయాలంటూ బంధువులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

మంచిర్యాల అర్బన్/రామకృష్ణాపూర్, జనవరి 9 : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే కూలీ మృతి చెందాడని, అతడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ దవాఖాన ఎదుట జాతీయ రహదారిపై బంధువులు రాస్తారోకో నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామానికి చెందిన రావుల సురేష్(35) విద్యుత్ పనులు నిర్వహించే ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తున్నాడు. విధుల నిమిత్తం బుధవారం రాత్రి రామకృష్ణాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి చెరువు వద్ద విద్యుత్ స్తంభం కొలతల కోసం పైకి ఎక్కాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్ తగిలి స్తంభం పై నుంచి కిందపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

న్యాయం చేయాలని రాస్తారోకో..

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన వద్ద జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సురేష్ మృతి చెందాడని, అతడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు. అధికారులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

అత్యల్పం.. అత్యధికం..

- ఆసిఫాబాద్ జిల్లాలో విచిత్రమైన వాతావరణం
- జంబుగలో గరిష్ఠంగా 34.8, సిర్పూర్ (యూ)లో కనిష్ఠంగా 5.2 డిగ్రీలు

సిర్పూర్(యూ)లో రోడ్డును కమ్మేసిన పొగమంచు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం వాతావరణంలో విచిత్రమైన పరిస్థితి కనిపించింది. రాష్ట్రంలోనే అత్యల్ప.. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగజ్‌నగర్ మండలంలోని జంబుగలో గరిష్ఠంగా 34.8 డిగ్రీలు నమోదు కాగా, సిర్పూర్(యూ)లో కనిష్ఠంగా 5.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. ఉదయం ఎనిమిదింటి దాకా పొగమంచు తొలగలేదు. కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లడ్ లైట్లు వేసుకొని ప్రయాణించగా, మరికొందరు పూర్తిగా పొగమంచు తొలగిన తర్వాతే బయలుదేరారు. ఇక చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోయారు. చిన్నా పెద్దలంతా చలిమంటలు కాగుతూ కనిపించారు. ఇక మధ్యాహ్నం వేళ కాస్త ఎండగా అనిపించింది.

- ఐదు గుంటల్లోపు భూముల రిజిస్ట్రేషన్లపై నజర్.. పలు ఆదేశాలు
- కేవలం ఇంటి నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయడం ఇక కుదరదు
- ప్రభుత్వ, అసైన్డ్, పట్టా.. ఇలా ఏ భూముల్లో నిర్మాణమున్నా ధ్రువపత్రం తప్పనిసరి
- సబ్ రిజిస్ట్రార్‌లకు సందేహాలుంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాల్సిందే
- తహసీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు హుకుం
- లబోదిబోమంటున్న వ్యాపారులు

భూ దందా ఆగేనా..!

'రియల్' మోసాలపై కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్

మంచిర్యాల, జనవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మేం గుంట చొప్పున భూమి అమ్ముతాం. రిజిస్ట్రేషన్ కూడా చేపిస్తాం. లే-అవుట్ అవసరం లేదు. ఫామ్‌ల్యాండ్స్ మీద పెట్టుబడి పెట్టండి. మీ భూమిలో ఎర్రచందనం, శ్రీగంధం చెట్లు పెట్టిస్తాం. లక్షల రూపాయలతో మీరు ఇప్పుడు కొనుగోలు చేసే గుంట స్థలం.. కొన్నేళ్లకు మిమ్ములను కోటీశ్వరులను చేస్తుంది. గుంట భూమి కొంటే చాలు. గజానికి రూ.ఐదు వేల నుంచి రూ.6 వేలు మాత్రమే మీ పెట్టుబడి. మా దగ్గర భూమి కొన్నోళ్లకు ఎన్నో ఆఫర్లు ఉన్నాయి. వారం రోజుల్లో సగం డబ్బులు చెల్లిస్తే లక్కీడ్రా తీస్తాం. కారు, స్కూటీలు, బంగారం గెలుచుకోవచ్చు.' అని తీయని మాటలతో కష్టమర్ల గొంతులు కోసే ఫామ్‌ల్యాండ్స్ దందా జిల్లాలో జోరుగా సాగుతున్నది. నిబంధనల ప్రకారం ఫామ్‌ల్యాండ్స్ గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేయడానికి లేదు. కానీ అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెప్పి నాలా కన్వర్షన్ చేయించుకునో, ఇంటి నంబర్లు సృష్టించో.. ఎలాగోలా రిజిస్ట్రేషన్ చేపించడం, కష్టమర్లను బురిడీ కొట్టించడం పరిపాటిగా మారింది. ఎకరం భూమి రూ. ఐదు నుంచి రూ. పది లక్షలకు కొనడం, ఫామ్‌ల్యాండ్స్ పేరిట గుంటకు రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు అమ్మడం.. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి ఎగనామం పెట్టి కోట్లు సంపాదించుకోవడం జరుగుతున్నది. ఇక కొందరు రియల్టర్లు పట్టా భూముల పక్కనున్న అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను సైతం రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కొందరు ప్రబుద్ధులు అసైన్డ్, ప్రభుత్వ భూములకు ఇంటి నంబర్లు తీసుకొని దర్జాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు విలువైన ప్రభుత్వ భూముల, అసైన్డ్ భూములు కోల్పోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ అంశాలను కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇలాంటి భూ మోసాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఐదు గుంటల్లోపు భూములను రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు అన్ని డాక్యుమెంట్స్ ఉంటేనే చేయాలంటూ తహసీల్దార్లకు ఈ నెల 4న ఆదేశాలు జారీ చేశారు. ఇదే తరహాలో గత నెలలో సబ్ రిజిస్ట్రార్‌లపై సైతం సూచనలు చేశారు.

లబోదిబోమంటున్న వ్యాపారులు..

కలెక్టర్ ఆదేశాలతో అక్రమార్కులతో పాటు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల గుండెల్లో దడ పుడుతున్నది. గడిచిన ఏడాది కాలంగా రిజిస్ట్రేషన్లు లేక పెట్టిన పెట్టుబడి మొత్తం ఆగిపోయి నానా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో ఇక తమ భూముల రిజిస్ట్రేషన్లు కావని భయపడుతున్నారు. ముఖ్యంగా ఫామ్‌ల్యాండ్స్ వ్యాపారానికి పేరుగాంచిన జైపూర్ మండలంలో పెట్టుబడి పెట్టిన రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు. మండలంలో నర్వా, టేకుమట్ల, షెట్‌పల్లి, రాసూల్‌పల్లి, ఇందారం గ్రామాల్లో ఫామ్‌ల్యాండ్స్ వ్యాపారులకు ఈ నిర్ణయం కొత్త కష్టాలను తీసుకురానున్నది. ఇప్పుడేదో అధికారులను మేనేజ్ చేసుకొని అతికష్టంగా నెలకు ఒకటీ.. రెండు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నామని.. గత నాలుగు రోజులుగా అది కూడా చేయడం లేదంటున్నారు. ఇన్నాళ్లూ సహకరించిన అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారని వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా నాలా కన్వర్షన్ పేరుతో ఎలాగోలా రిజిస్ట్రేషన్లు చేసిన కొందరు తహసీల్దార్లకు ఇప్పుడు ఈ వ్యవహారం మింగుడుపడడం లేదు. అసలు కలెక్టర్ ఇకపై చేసే డాక్యుమెంట్ల వివరాలు అడగకుండా.. గడిచిన ఏడాదిలో చేసిన రిజిస్ట్రేషన్లపై నివేదిక తీసుకుంటే భూముల రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న అక్రమాలు బయటికి వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత రిజిస్ట్రేషన్లను పరిశీలించి నిబంధనలకు వ్యతిరేకంగా పని చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలు ఇలా..

- ఐదు గుంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసేప్పుడు అన్ని డాక్యుమెంట్లు తహసీల్దార్ తప్పనిసరిగా సరిచూసుకోవాలి.
- చిన్న విస్తీర్ణాలు (ఐదు గుంటల లోపు)చేసిన రిజిస్ట్రేషన్లపై ప్రతి నెలా కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలి.
- నాలా కన్వర్షన్, హౌస్ సైట్స్, ఇప్పటికే ఉన్న నిర్మాణాలు, అనధికారిక లేవుట్‌లలో చేసే రిజిస్ట్రేషన్లు ఇల్లీగల్ లేఅవుట్‌లను పెరగడానికి, న్యాయపరమైన ఇబ్బందులకు దారి తీస్తున్నాయి. చిక్కులు వస్తున్నాయి. ఈ విషయంలో తహసీల్దార్లు ఎవరూ నిబంధనలు అతిక్రమించకూడదు.
- సబ్‌రిజిస్ట్రార్లు సర్వే నంబర్ లేకుండా ఇంటి నంబర్‌తో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. అలా కాకుండా సబ్‌రిజిస్ట్రార్లు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలి.
- డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు అందులోని సర్వే నంబర్ ఆధారంగా అది రెవెన్యూ రికార్డుల్లో ప్రొహిబిటెడ్ లిస్ట్(నిషేధిత జాబితా)లో ఉందా లేదా చూసుకోవాలి. ఈ విషయంలో ఏమైనా సందేహాలుంటే సంబంధిత తహసీల్దార్లను సంప్రదించి క్లారిటీ తీసుకోవాలి.
- సబ్ రిజిస్ట్రార్ ఇలా రెఫర్ చేసిన డాక్యుమెంట్లను తహసీల్దార్ పరిశీలించి నేచర్ ఆఫ్ ల్యాండ్ (ఆ ప్రాపర్టీ ప్రభుత్వ భూమిలో ఉందా, అసైన్డ్ భూమిలో ఉందా లేక పట్టా భూమిలో ఉందా) ఎంక్వైరీ చేసి 48 గంటల్లో సబ్‌రిజిస్ట్రార్ రిపోర్ట్ ఇవ్వాలి.
- ఒకవేళ పట్టాభూమి కాకుండా అసైన్డ్ లేదా ప్రభుత్వ భూమిలో ఉంటే ఆ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయొద్దు.
- కేవలం హౌస్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయడానికి వీలులేదు. ఇంటి నంబర్‌తో పాటు ప్లింత్ ఏరియా (ఇంటి నిర్మాణ విస్తీర్ణం)పై సంబంధిత మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీ ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే చేయాలి.
- సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు ఈ నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

తవ్వి, పూడ్చిన కాలువకు రూ. రెండు లక్షలు

- ఆక్రమణలు, ఎలక్ట్రికల్ కేబుళ్ల తొలగించడం కోసమని ఎజెండాలో అంశం
- జనరల్ ఫండ్ నుంచి నిధులు అప్పగించేందుకు కౌన్సిల్ అంగీకారం
- మంచిర్యాల మున్సిపాలిటీలో విచిత్రం

మంచిర్యాలటౌన్, జనవరి 9 : పట్టణంలోని మార్కెట్‌రోడ్‌లోగల క్వాలిటీ బేకరీ నుంచి పాత ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం వరకు నవంబర్‌లో చేపట్టిన పెద్ద కాలువ తవ్వకం, పూడ్చివేతకు అయిన ఖర్చు అక్షరాలా రూ. రెండు లక్షలు. అసలు ఎందుకు తవ్వారో, ఎందుకు పూడ్చారో తెలియని ఈ తతంగానికి మున్సిపాలిటీ జనరల్‌ఫండ్ నుంచి రూ. రెండు లక్షలను అప్పగించేందుకు కౌన్సిల్ అంగీకరించింది. పైగా ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌ల మౌఖిక ఆదేశాలతోనే అంటూ ఎజెండాలో ఈ అంశాన్ని చేర్చారు. ఆక్రమణలు, ఎలక్ట్రికల్ కేబుళ్లు తొలగించడం కోసమని ఎజెండాలో పొందుపరిచారు. ఈ నెల ఆరో తేదీన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎజెండాలో ఈ అంశాన్ని చేర్చి ఆమోదించేశారు. నవంబర్‌లో చేపట్టిన కాలువ తవ్వకాలపై ఎవరికీ ఎలాంటి అవగాహన లేకపోగా, ఎవరినీ అడిగినా తమకు తెలియదని మున్సిపల్ అధికారులు అప్పట్లో పేర్కొన్నారు. తీరా ఇందుకు సంబంధించిన బిల్లు ఎజెండాలోకి రావడంతో అందరూ అవాక్కయ్యారు. అసలు ఈ కాలువ ఎందుకు తవ్వుతున్నారు, ఇక్కడ ఏం నిర్మిస్తారు, దేనికోసం అన్న విషయాలు ఆ సమయంలో రహస్యంగా ఉన్నాయి. ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ముందుగా నిధులు కేటాయింపు, టెండరు పిలవాల్సి ఉంటుంది. కానీ, అవేమీ లేకుండానే ఇక్కడ కాలువ తవ్వకం మొదలు పెట్టారు. మళ్లీ అదే కాలువను పూడ్చివేశారు. ఈనెలలోనే పాలక వర్గం పదవీకాలం ముగుస్తుండడం, చివరాఖరుగా నిర్వహించిన సమావేశంలో ఇష్టారీతిన బిల్లులు పెట్టారన్న వాదనలు వినిపిస్తున్నాయి, అంతకుముందు డిసెంబరులో నిర్వహించిన సమావేశంలో కూడా మోటర్ల మరమ్మతులు, సబ్‌మెర్సిబుల్ మోటర్ల ఏర్పాట్లు, మరమ్మతుల పేరిట పెద్ద ఎత్తున బిల్లులు పెట్టినట్లు సమాచారం. తమ వార్డులో సబ్‌మెర్సిబుల్ మోటర్లు రిపేరు చేయలేదని కొందరు, అసలు కొత్త మోటర్లు పెట్టలేదని కొందరు కౌన్సిలర్లు అంటున్నారు. ఇంటర్ లింక్ పైపులైన్ కనెక్షన్‌లు కూడా ఇవ్వలేదని పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు. ఈ అంశాలపై పూర్తిస్థాయిలో లోతైన దర్యాప్తు చేపట్టాలని పలువురు ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మంచిర్యాలలోని మార్కెట్‌రోడ్‌లో డ్రైనేజీకోసం తవ్విన కాలువ (ఫైల్)

క్యూ ఆర్ కోడ్ కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

స్కాన్ చేయండి.. అభిప్రాయం తెలపండి

- రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జనవరి 9 : క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పోలీస్ సిబ్బంది పనితీరుపై అభిప్రాయం తెలపాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం డీజీపీ జితేందర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా రామగుండం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి క్యూ ఆర్ కోడ్‌కు సంబంధించిన పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించడం కోసం క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఊరెళ్తున్నారా... జాగ్రత్త..

సంక్రాంతి సెలవులకు సొంతూర్లకు వెళ్తున్న వారంతా అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని తెలిపారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం చేయాలి

తాండూర్, జనవరి 9 : పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం తాండూర్ మండలం మాదారంలోని సింగరేణి పాఠశాలను పరిశీలించారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ గురుకుల పాఠశాలను ఇక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అనుకూల పరిస్థితులపై స్థానికులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై సింగరేణి సీఅండ్ ఎండీతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను మండల తహసీల్దార్ ఇమ్రానాఖాన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. మాదారం ఎస్ఐ సౌజన్య, డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్, నాయకులు సూరం దామోదర్‌రెడ్డి, పుట్ట శ్రీనివాస్, కుప్పపల్లి లక్ష్మణ్, మోమిన్ అలీ, గట్టు లక్ష్మణ్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.